సాక్షి వనపర్తి

శనివారం । 24 । ఆగస్టు । 2024



జలసవ్వడి
ఉమ్మడి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి.

వివరాలు 8లో ▸



ముమ్మరంగా విద్యుదుత్పత్తి
జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.4 /21.7

వాతావరణం
రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. రాత్రివేళలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కీటక జనిత వ్యాధులపై చైతన్యం చేయాలి : డీఆర్డీఓ



పాన్‌గల్: కీటక జనిత వ్యాధుల నివారణ, పరిసరాల శుభ్రతపై ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని డీఆర్డీఓ ఉమాదేవి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని చింతకుంట, రాయినిపల్లి, బుసిరెడ్డిపల్లిలో పర్యటించి పారిశుద్ధ్యం, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే రోగాలు దరి చేరవని, నిల్వ నీటిని వారానికి ఓసారి పారబోసి కొత్త నీటిని **పట్టుకొనేలా** ప్రజలకు అవగాహన కల్పించా**లని సూచిం**చారు. కీటక జనిత వ్యాధులు, **నివారణ వివ**రాలు తెలిపే కరపత్రాలను ప్రతి **ఒక్కరికి అం**దించాలని, విరివిగా మొక్కలు **నాటి సంరక్షిం**చాలన్నారు. గ్రామపంచాయ**తీ కార్యా**లయాల్లో రికార్డుల నిర్వహణ స**క్రమంగా ఉం**డాలని.. విధులు, పారిశుద్ధ్యంపై **అలసత్వం** వహిస్తే చర్యలు తప్పవని **హెచ్చరించారు.** కార్యక్రమంలో ఏపీఓ కుర్మయ్య, **పంచాయతీ** కార్యదర్శులు, ఆశ, అంగన్‌వాడీ **కార్యకర్తలు** పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త : డీఎంహెచ్‌ఓ



వనపర్తి రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డా. జయచంద్రమోహన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, ప్రసవాల గదిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. విధులకు సకాలంలో హాజరై రోగులకు నాణ్యమైన చికిత్స అందించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ఇల్లిల్లూ తిరిగి జ్వర పీడిత సర్వే చేపట్టి అనుమానితులకు రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. వర్షాకాలంలో శానిటేషన్, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అనంతరం 1వ వార్డులో కొనసాగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పట్టణ ప్రజలకు సూచించారు. ఆయన వెంట పుర చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, కమిషనర్ ఆదిశేషు, డా. శ్రీహరినాథ్‌రెడ్డి, ఎంఎల్‌పీ డా. చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఏఎన్‌ఎం లావణ్య, వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యవేక్షణతోనే బడుల బలోపేతం

వనపర్తిటౌన్: పర్యవేక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తేనే పాఠశాలలు బలోపేతం అవుతాయని డీసీఈబీ కార్యదర్శి చంద్రశేఖర్, ఏసీజీఈ గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో డీసీఈబీ (డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు) ఆధ్వర్యంలో ఎంఎన్‌ఓ(మండల నోడల్ ఆఫీసర్)లు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సీఆర్పీలు మొత్తం 80 మందికి ఇచ్చిన ఒకరోజు శిక్షణకు వారు హాజరై మాట్లాడారు. ఎంఎన్‌ఓలు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు మండలాల వారీగా పాఠశాలల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని, లోటుపాట్లను సవరించేందుకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. బోధన పద్ధతులపై ఆరా తీయడంతో పాటు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ప్రాథమిక విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు తొలిమెట్టు, 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించేందుకు ఉన్నతి, పదోతరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు లక్ష్యను లక్ష్యంగా మలుచుకొని ముందుకు సాగాలన్నారు. ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న చోట తరగతి గదిలోని విద్యార్థులందరి స్థాయిని ఒకేరీతిగా పెంచేందుకు బహుళస్థాయి బోధనను అందిపుచ్చుకోవాలని కోరారు. పాఠ్య ప్రణాళికలు రూపొందించుకొని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడే ప్రతి కార్యక్రమం విజయవంతంలో కీలక భూమిక పోషించాలని సూచించారు. పర్యవేక్షణను విస్మరిస్తే అనుకున్న లక్ష్య సాధనలో వెనుకబడతామని హెచ్చరించారు.



గద్వాల: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (వర్సెస్) జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత	**కొల్లాపూర్:** మంత్రి జూపల్లి (వర్సెస్) ప్రత్యర్థులు, బీఆర్‌ఎస్ నేతలు
వనపర్తి: ఎమ్మెల్యే మేఘారెడ్డి (వర్సెస్) రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి	**నాగర్‌కర్నూల్:** ఎమ్మెల్యే కూచుకుళ్ల (వర్సెస్) బీఆర్‌ఎస్
	అలంపూర్: మాజీ ఎమ్మెల్యే సంపత్ (వర్సెస్) ఎమ్మెల్యే విజయుడు

..ఇదీ ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో నెలకొన్న ప్రస్తుత రాజకీయ ముఖచిత్రం. అధికార కాంగ్రెస్‌లో ఇరువురు నేతల మధ్య ఆధిపత్య పోరు.. పలు చోట్ల అధికార, విపక్ష నేతల మధ్య ముదిరిన వైరంతో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఖద్దరు నేతలపై'చేయి' సాధించేందుకు ఖాకీలనే ఆయుధంగా మలుచుకున్నట్లు ఆయా సెగ్మెంట్లలో చోటుచేసుకున్న సంఘటనలే ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఈ క్రమంలో నలుగురు పోలీస్ అధికారులను విధుల నుంచి తొలగిస్తూ, వీఆర్‌కు అటాచ్ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. పేకాటరాయుళ్లకు పరోక్ష సహకారం, విధుల్లో నిర్లక్ష్యంపై చర్యలు తీసుకున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నా.. పరిస్థితి 'చేయి' దాటిపోతోందనే భావనతో వేటు వేసినట్లు పోలీస్‌శాఖలో చర్చ జోరుగా సాగుతోంది.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్



ఖద్దరు పోరు.. ఖాకీల జోరు!

- ఆధిపత్యమే హద్దుగా పోలీసులతో రాజకీయాలు
- కాంగ్రెస్‌లో తారస్థాయికి వర్గ విభేదాలు.. గద్వాల, వనపర్తిలో ముదిరిన వైరం
- కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అలంపూర్ సెగ్మెంట్లలో విపక్షాలే టార్గెట్
- పోలీస్‌శాఖను అడ్డుపెట్టుకుని వ్యవహారాలు చక్కబెడుతున్న పలువురు..
- నలుగురు ఖాకీలపై వేటుతో ఆ శాఖలో కలకలం

గద్వాల — నువ్వా.. నేనా

ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత మధ్య వార్ హోరాహోరీగా సాగుతోంది. ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ఎమ్మెల్యేతో కలిసి వెళ్తున్న మంత్రి జూపల్లి వాహనాన్ని సరిత వర్గీయులు అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారితీసిన విషయం తెలిసిందే. ఇదే కాదు.. ప్రొటోకాల్ లేకున్నా నియోజకవర్గంలో ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో సరిత దూకుడుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బండ్ల వర్గానికి సంబంధించిన వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని ఎమ్మెల్యేనే బాహాటంగా చెబుతుండడం విశేషం. మరోవైపు నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సైతం పోలీసులపై ఆరోపణలు ఉన్నాయి. ఇసుక, భూ వివాదాల్లో తల దూర్చడంతో పాటు తదితర కేసుల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వనపర్తి — ప్రొటోకాల్ రగడ.. టౌన్ ఎస్‌ఐపై ఫిర్యాదు

ఈ నియోజకవర్గంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి వర్సెస్ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నట్లుగా పరిస్థితులు నెలకొన్నాయి. కర్నెతండా పీహెచ్‌సీ ప్రారంభం, కేఎల్‌ఐ కాల్వలకు నీటి విడుదలలో ఎమ్మెల్యే లేకుండానే చిన్నారెడ్డి కార్యక్రమాలు నిర్వహించడం దుమారం రేపింది. ఇటీవల పట్టణంలో ఆర్టీసీ బస్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు కాగా ఎమ్మెల్యే గైర్హాజరు కావడంతో వాయిదా పడింది. అదే రూట్‌లో మరో రోజు ఎమ్మెల్యే బస్‌ను ప్రారంభించడం వివాదానికి దారి తీసింది. చిన్నారెడ్డి వేచిచూశారని.. ఆయన లేకుండా ఎలా ప్రారంభిస్తారంటూ ఆయన వర్గీయులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో చిన్నారెడ్డి వర్గీయులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు బలవంతంగా వాహనాల్లో ఎక్కించడం మరింత ఉద్రిక్తతకు దారితీసింది. ఉన్నతాధికారులు జోక్యంతో సమస్య సద్దుమణిగినా.. టౌన్ ఎస్సై జయన్న దురుసు ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలని చిన్నారెడ్డి వర్గీయులు ఎస్పీతో పాటు రాష్ట్రస్థాయి పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. కొందరు పోలీసులు పక్షపాతం చూపిస్తున్నారని చిన్నారెడ్డి వర్గం బాహాటంగానే విమర్శిస్తోంది.

కొల్లాపూర్ — రాజకీయ హత్యలంటూ..

ఈ నియోజకవర్గంలో మంత్రి జూపల్లి కృష్ణారావు వర్సెస్ ఆయన ప్రత్యర్థులు, బీఆర్‌ఎస్ నేతలు అన్నట్లు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సెగ్మెంట్‌లో ప్రధానంగా వరుస హత్యలు బెంబేలెత్తిస్తున్నాయి. అవి రాజకీయ హత్యలంటూ విపక్ష నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి.. పెద్దకొత్తపల్లి మండలం గంట్రావ్‌పల్లి, దేదినేనిపల్లిలో చోటుచేసుకున్న హత్య ఉదంతాలను ఉదహరిస్తున్నారు. అంతేకాదు హత్యలకు సంబంధించి విచారణలో మంత్రి జోక్యం చేసుకుంటున్నారని.. పోలీసులపై ఒత్తిళ్లు తెచ్చి తారుమారు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలువురిపై పోలీసులు నిరాధారమైన కేసులు నమోదు చేసి.. కొందరిని రిమాండ్‌కు తరలించినట్లు సైతం ఆరోపణలు ఉన్నాయి.

అలంపూర్ — ప్రొటోకాల్ వివాదం..

ఈ నెల ఆరో తేదీన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం మోటార్లు ఆన్ చేసి.. నీటిని విడుదల చేసే విషయంలో ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మధ్య పోటీ ఉద్రిక్తతకు దారి తీసిన విషయం తెలిసిందే. పోలీసులు ఎమ్మెల్యే విజయుడిని అరెస్ట్ చేయగా.. సంపత్ మోటార్లు ఆన్ చేసి డిస్ట్రిబ్యూటరీ చానల్ వద్ద గంగ పూజ చేసి వెళ్లడం హాట్‌టాపిక్‌గా మారింది. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ వారి తీరుపై ఎమ్మెల్యే మండిపడ్డారు. సంపత్‌కు ప్రొటోకాల్ ఏదంటూ.. పోలీసులు ఆయన కనుసన్నల్లో పని చేస్తున్నారని.. కావాలని తమ అనుచరులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సైతం ఆరోపించారు.

నాగర్‌కర్నూల్ — రాజకీయ కక్షలంటూ..

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో పోలీసులు ఇటీవల ముగ్గురు బీఆర్‌ఎస్ నేతలపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించడం చర్చనీయాంశంగా మారింది. వనపట్లలో ఓ భూ వివాదానికి సంబంధించి బాధితుడు ఆత్మహత్యకు యత్నించగా.. ఈ వివాదంలో ఆరోపణలున్న వనపట్ల మాజీ సర్పంచ్ భర్త మన్నెపురెడ్డి, కుమ్మెర మాజీ సర్పంచ్ భర్త తిరుపతిరెడ్డి, నర్సాయిపల్లి మాజీ సర్పంచ్ భర్త రామకృష్ణారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ రాజకీయ కక్షలో భాగంగానే సంబంధం లేని విషయంలో పోలీసులను పురిగొల్పి తమ నాయకులను జైలుకు పంపారని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.

నలుగురిపై వేటుతో ఖాకీల్లో కలవరం..

గద్వాల జిల్లాలో పేకాటకు సంబంధించి ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు.. మంత్రి వాహనం అడ్డగింతలో వైఫల్యంపై మరో సీఐని విధుల నుంచి తప్పించి వీఆర్‌కు అటాచ్ చేయడం ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో రాజకీయ నాయకుల అంటకాగుతున్న పలువురు పోలీసుల్లో కలవరం మొదలైంది. నాయకుల మాట వింటే ఒకలా, వినకపోతే మరోలా.. ఏం చేయాలని తలపట్టుకుంటున్నారు.

డీసీసీబీ పీఠం కాంగ్రెస్ కైవసం

చైర్మన్‌గా మామిళ్లపల్లి ఏకగ్రీవ ఎన్నిక



మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి టైటస్‌పాల్.. చిత్రంలో ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

- దశాబ్దాల కల నిజం చేసుకున్న విష్ణువర్ధన్‌రెడ్డి
- ఎన్నికకు ఇద్దరు డైరెక్టర్ల దూరం.. హాజరైన ఎమ్మెల్యేలు
- తగిన సంఖ్యా బలం ఉన్నా.. పోటీకి దూరంగా బీఆర్‌ఎస్
- 'చే'జిక్కడంతో శ్రేణుల్లో హర్షాతిరేకాలు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఎన్నిక శుక్రవారం లాంఛనంగా జరగగా కొల్లాపూర్ నియోజకవర్గంలోని పాన్‌గల్ సింగిల్ విండో చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డీసీసీబీ పరిధిలో మొత్తం 77 ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాలు (పీఏసీఎస్) ఉండగా.. 15 డైరెక్టర్ స్థానాలు ఉన్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2020 ఫిబ్రవరి 19న డీసీసీబీ ఎన్నికలు నిర్వహించగా.. చైర్మన్‌గా బీఆర్‌ఎస్‌కు చెందిన మక్తల్ పీఏసీఎస్ డైరెక్టర్ నిజాంపాషాను ఎన్నికయ్యారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఇటీవల చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో నూతన చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా సహకార శాఖ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి టైటస్‌పాల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. దీంతో విష్ణువర్ధన్‌రెడ్డి ఒక్కరే మూడు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియలో విష్ణువర్ధన్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఇద్దరు డైరెక్టర్లు చిట్యాల నిజాంపాషా, మంజులారెడ్డి గైర్హాజరయ్యారు.

అనేక ప్రయత్నాలు చేసి..

ఎన్నో సంవత్సరాలుగా రైతు సేవలో ఉన్న విష్ణువర్ధన్‌రెడ్డి రెండుసార్లు కొల్లాపూర్ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత డీసీసీబీ చైర్మన్ పదవి కోసం అనేక ప్రయత్నాలు చేశారు. అనూహ్యంగా ఇక్కడి చైర్మన్ నిజాంపాషా రాజీనామా చేయడంతో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి ద్వారా చైర్మన్ పదవికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 15 మంది డైరెక్టర్లు ఉండగా.. 13 మంది ఎన్నికకు హాజరయ్యారు. మెజారిటీ డైరెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరచడంతో ఆయన చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్ ఎన్నిక విషయంలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా సహకరించినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇన్నాళ్లు రాజకీయంలో ఉంటూ తాను ఆశించిన చైర్మన్ పదవి ఎట్టకేలకు దక్కడంతో విష్ణువర్ధన్‌రెడ్డి కల నెరవేరినట్లు అయింది. చైర్మన్‌గా ఎన్నికైన విష్ణువర్ధన్‌రెడ్డిని ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, శ్రీహరి, మేఘారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, పర్ణికారెడ్డి, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సహకార బ్యాంకు పాలక మండలి గడువు మరో ఆరు నెలల్లో ముగియనుంది. ఈ సందర్భంగా చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు, డీసీసీబీ డైరెక్టర్లు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

➪ ఇదిలా ఉండగా ప్రతిపక్షం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 12 మంది డైరెక్టర్లు ఉన్నా డీసీసీబీ చైర్మన్ పదవికి పోటీ చేయకపోవడం విశేషం. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం.. మరోవైపు డీసీసీబీ చైర్మన్ పదవీకాలం కేవలం ఆరు నెలలు మాత్రమే ఉండడంతో అంతగా ఆసక్తి చూపలేదని తెలుస్తుంది. డీసీసీబీ చైర్మన్ పదవి కాంగ్రెస్ చేజిక్కించుకోవడంతో పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

స్వచ్ఛతను నిర్లక్ష్యం చేయడం సరికాదు

కొత్తకోట రూరల్: రోడ్లపై మురుగు పారడంతో పారిశుద్ధ్యం లోపించి దోమల బెడద అధికమై డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని.. ఇదంతా తెలిసి కూడా స్వచ్ఛతపై దృష్టి సారించకపోవడం సరికాదని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పుర అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన కొత్తకోటలోని 13, 15 వార్డుల్లో అధికారులతో కలిసి పర్యటించారు. రోడ్లపై మురుగు, చెత్తా చెదారం చూసి అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలో సుమారు 40 వేల జనాభా ఉందని.. దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదని పలువురు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పుర కమిషనర్ సూర్యకుమార్, సిబ్బంది పొంతన లేని సమాధానం చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైడేను తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారని.. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించిన సందర్భాలు లేవని వివిధ పార్టీల నాయకులు తెలిపారు. స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దాలని.. రోడ్లపై మురుగు పారకుండా తగిన చర్యలు తీసుకోవాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట మున్సిపల్ ప్రత్యేక అధికారి స్వరణ్‌సింగ్, పట్టణవాసులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మిషేక్, సుభాష్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఆశ వర్కర్లు, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.



కొత్తకోటలో అధికారులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

మదనాపురం: పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేయొద్దని.. గ్రామాల్లో స్వచ్ఛత లోపించకుండా చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మండలంలోని దంతనూరులో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌లాంటి జ్వరాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో తాత్సారం పనికిరాదని సిబ్బందికి సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఎంపీఓ హుస్సేనప్ప, పంచాయతీ కార్యదర్శి మహేందర్, ఏఎన్‌ఎం చంద్రకళ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు ప్రమీల, కృష్ణవేణి, ఆశాలు భాగ్యలక్ష్మి, కావేరి పాల్గొన్నారు.

అతివల ఆర్థికాభివృద్ధికి సహకారం

వనపర్తి: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళాశక్తి పథకంపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించడంతో పాటు సేవారంగంలో పనిచేసే విధంగా నూతన వ్యాపార అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లాకేంద్రంలో క్యాంటీన్, పిజ్జాహట్, పండ్ల దుకాణం, బ్యూటీపార్లర్ తదితర వ్యాపారాలను నెలకొల్పేలా చూడాలని, నైపుణ్య శిక్షణ ఇప్పించాలన్నారు. జిల్లాకేంద్రంలో మహిళా సాధికారతకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీఓ ఉమాదేవి, డీపీఎం అరుణ, అదనపు డీఆర్డీఓ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



పామిరెడ్డిపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

పకడ్బందీగా జ్వర సర్వే..

కొత్తకోట రూరల్: ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని.. జ్వరాలు నమోదవుతున్న ప్రాంతాల్లో ఫీవర్ సర్వే పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్దమందడి మండలంలోని చిన్నమందడిలో డ్రై డే కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాత ప్లాస్టిక్ సామాన్లు, టైర్లలో వర్షపు నీరు చేరి దోమలు వ్యాప్తిచెంది డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమంలో నిల్వ నీటిని పారబోయడం, పరిసరాలు శుభ్రం చేసుకోవడం జరగాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఇంట్లో కూడా నిర్వహించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. డెంగీ కేసులు నమోదవుతున్న ఇళ్లను సందర్శించి యజమానులతో మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

పంట వివరాల నమోదు పరిశీలన..

పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి శివారులో కొనసాగుతున్న పంట వివరాల నమోదును కలెక్టర్ పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటల సాగు, రుణమాఫీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలో అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్య పుస్తకాలు చదివించి సామర్థ్యాలను పరిశీలించారు. ఎంపీడీఓ సద్గుణ, ప్రోగ్రాం అధికారి డా. సాయినాథ్‌రెడ్డి ఉన్నారు.

109 మంది పంచాయతీ కార్యదర్శుల బదిలీ

వనపర్తి: రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా జిల్లావ్యాప్తంగా 109 మంది సీనియర్, జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తూ శుక్రవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 14 మండలాల్లో సొంత మండలం, ప్రాంతంలో పనిచేస్తున్న వారు, మూడేళ్లుగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న వారికి స్థాన చలనం కల్పించినట్లు తెలుస్తోంది. జిల్లాల ఏర్పాటు తర్వాత భారీ సంఖ్యలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలు చేపట్టడం ఇదే ప్రథమంగా ఆ శాఖలో చర్చ వినిపిస్తోంది.

మహిళల భద్రతకే షీ టీమ్స్

వనపర్తి: మహిళల భద్రతకే షీ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రావుల గిరిధర్ వెల్లడించారు. మహిళలు, బాలికలను వేధింపులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా షీటీమ్స్ విభాగాలు మహిళలు, విద్యార్థినులకు రక్షణ కవచంగా పని చేస్తాయన్నారు. ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ నేరాల బారిన పడితే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. పట్టణ ఎస్‌ఐలు జయన్న, రామరాజు, షీటీమ్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ రామరాజుయాదవ్ పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

కొత్తకోట రూరల్: యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని.. మత్తు, చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. శుక్రవారం పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి ఆయనతో పాటు డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. యువత గ్రామ పెద్దలను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. గ్రామంలో 23 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని.. గ్రామస్తులు సమష్టిగా ఉండి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దాతలు ముందుకు రావాలని కోరారు. నిరుద్యోగులు సంఘాలుగా ఏర్పడితే స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్వయం ఉపాధి చూపేందుకు తమవంతు కృషి చేస్తామని హామీనిచ్చారు. వినాయక చవితికి మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించాలన్నారు. అనంతరం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సీఐ రాంబాబు, ఎస్‌ఐ శివకుమార్, మాజీ డిప్యూటీ సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, రఘుగౌడ్, లక్ష్మారెడ్డి, చందు, నరేష్, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్


జలసవ్వడి


మూసాపేట మండలం నిజాలాపూర్‌లో అలుగు పారుతున్న పెద్దవాగు చెక్‌డ్యాం


జడ్చర్ల మండలం నెక్కొండ చెక్‌డ్యాం వద్ద దుందుభీ ఉధృతి

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో వాగులకు వరద పోటెత్తింది. చెక్‌డ్యాంల వద్ద జలసవ్వడి నెలకొంది. జడ్చర్ల మండలంలోని నెక్కొండ, లింగంపేటలో దుందుభీ వాగు చెక్‌ డ్యాంలు మత్తడి పోస్తున్నాయి. కోడ్గల్ వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షాలు ఇలాగే పడితే అల్వాన్‌పల్లి వద్ద వాగు పారేందుకు మరెంతో సమయం పట్టదు. మరోవైపు మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విస్తరించి ఉన్న పెద్దవాగుకు భారీగా వరద ప్రవాహం ఉంది. నిజాలాపూర్ వద్ద వాగులో నిర్మించిన చెక్‌డ్యాం అలుగు పారుతోంది. సంకలమద్ది, గౌరిదేవిపల్లి చెక్‌డ్యాంలు జలకళను సంతరించుకున్నాయి.

– జడ్చర్ల టౌన్/అడ్డాకుల


జడ్చర్ల మండలంలో దుందుభి ప్రవాహం..


మత్తడి పోస్తున్న లింగంపేట చెక్‌డ్యాం

క్లుప్తంగా

వివాహిత బలవన్మరణం

మిడ్జిల్: పురుగు మందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొత్తూర్‌లో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. ఉర్కొండ మండలం గుడిగాన్‌పల్లికి చెందిన మమత (21)ను కొత్తూర్‌కు చెందిన శ్రీకాంత్‌కు ఇచ్చి మూడేళ్ల కిందట వివాహం జరిపించారు. వారికి 18 నెలల, 3 నెలల పిల్లలు ఉన్నారు. గురువారం మధ్యాహ్నం భార్యాభర్తల మధ్య చిన్న గొడవ జరగడంతో మమత పురుగుమందు తాగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

భూత్పూర్: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన భూత్పూర్ మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. అమిస్తాపూర్‌కు చెందిన కెంద్యాల చెన్నమ్మ (53) తన భర్త వెంకట్రాములు, కూతురు కవిత, మనుమరాలు నందినితో కలిసి రేకుల ఇంట్లో నివాసముంటున్నారు. రోజు మాదిరిగానే భర్త వెంకట్రాములు, కూతురు కవిత కూలీ పనులకు వెళ్లారు. విద్యుత్ సర్వీసు వైరు కొంత తేలి ఇంటి రేకులకు తగిలిన విషయాన్ని గమనించని చెన్నమ్మ.. బాత్రూం వెళ్లడానికి డోరు పట్టుకోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. భర్త వెంకట్రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు ఆటోలు ఢీ: వృద్ధురాలు..

మహబూబ్‌నగర్ క్రైం: రాయచూర్–మహబూబ్‌నగర్ జాతీయ రహదారిపై రెండు ఆటోలు బలంగా ఢీకొనడంతో వృద్ధురాలు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వన్‌టౌన్ ఎస్‌ఐ శీనయ్య కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ ఏరియాకు చెందిన పోచమ్మ(60) శుక్రవారం బండమీదిపల్లి నుంచి బస్టాండ్‌కు వెళ్లడానికి ఆటో ఎక్కింది. అయితే బస్టాండ్ నుంచి వన్‌టౌన్ వైపు వస్తున్న ట్రాలీ ఆటో వన్‌టౌన్ చౌరస్తా సమీపంలో రోడ్డు దాటే క్రమంలో రెండు ఆటోలు ఢీకొట్టుకోవడంతో పోచమ్మ అక్కడిక్కడే మృతి చెందింది. డ్రైవర్ నాగరాజు, మరో వ్యక్తికి గాయాలు అయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

కేసు నమోదు

మహమ్మదాబాద్: బాలికను అత్యాచారం చేసినందుకుగాను ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలానికి చెందిన ఓ బాలికపై షాద్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి నెల కిందట అత్యాచారం చేశాడు. బాధితురాలు ఈ విషయం తన అక్కకు చెప్పడంతో ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యసిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఖాతాలో నుంచి నగదు మాయం

కల్వకుర్తిరూరల్: బ్యాంకు యాప్ డౌన్‌లోడ్ చేసుకోండని మొబైల్‌కు ఓ మెసేజ్ వచ్చింది. అందులో ఉన్న లింకు ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేయగా వెంటనే అతని ఖాతా నుంచి నగదు మాయమైంది. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం కల్వకుర్తి మండలం మార్చాల సమీపంలో ఉన్న సూర్యలత కాటన్‌మిల్లులో పనిచేసే కుశేంద్రకుమార్ మొబైల్‌కు యూనియన్ బ్యాంకు యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని మెసేజ్ వచ్చింది. నిజమే అని నమ్మి లింకు ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. కొద్ది నిమిషాల్లోనే బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.20లక్షలను కాజేశారు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసినప్పటికి వివరాలు గోప్యంగా ఉంచారు.

ఆస్తి తేలేదని..
కట్టుకున్నోడే కడతేర్చాడు

- డంపింగ్ యార్డులో మృతదేహం పారవేత..
- కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు
- మిస్టరీ వీడిన వివాహిత అదృశ్యం కేసు.. నిందితుడి అరెస్ట్


అనిత (ఫైల్)

జడ్చర్ల: పుట్టింటి నుంచి ఆస్తి తేలేదన్న అక్కసుతో కట్టుకున్న భార్యను భర్తే కడతేర్చాడు. పక్కా పథకం వేసి తాను అనుకున్నట్లుగానే దారుణంగా గొంతు నులిమి తలపై బండరాయిని ఎత్తివేసి అంతమొందించాడు. రెండు రోజుల తర్వాత తన భార్య కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసి తప్పించుకోవాలని యత్నించాడు. అయితే మిస్సింగ్ వెనక తమ తండ్రి హస్తం ఉందేమో అన్న అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు కూపీ లాగి మిస్టరీని ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించి సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన బియని జంగిరెడ్డి, అనిత(40) దంపతులు గ్రామంలో వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు కాగా వివాహం చేశారు. ఇటీవల భార్య అనిత తల్లిగారికి సంబంధించిన ఆస్తిలో ఆమె చెల్లెలికి అర ఎకరా భూమితో పాటు రూ.5 లక్షల నగదు ఇస్తున్నారని జంగిరెడ్డికి తెలిసింది. దీంతో తన భార్య అనితను పురమాయించి తమ వాటాగా ఆస్తిని తీసుకురావాలని ఒత్తిడి చేశాడు. అయితే జంగిరెడ్డి పెద్ద కూతురును పెళ్లి చేసుకున్న బావమరిది ఆస్తి ఇవ్వడానికి అంగీకరించలేదు. చెల్లెలు పేదరికంలో ఉన్నందును ఆమెకు కొంత చేయూత ఇచ్చేందుకు ఆస్తిలో వాటా ఇచ్చామని తేల్చి చెప్పారు. దీంతో తన భార్య పుట్టింటి నుంచి ఆస్తిలో వాటా తీసుకురాలేదన్న అక్కసుతో జంగిరెడ్డి ఎలాగైనా భార్యను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు.

పక్కాగా పథకం వేసి..

ఈ నెల 17న తన భార్య అనితను మోటార్‌బైక్‌పై ఎక్కించుకుని పోలేపల్లి సెజ్ సమీపంలోని నిర్జన ప్రదేశం డంపింగ్ యార్డు దగ్గరకు తీసుకువచ్చాడు. అక్కడ పాత ఇనుప సామగ్రి ఉంటుందని.. దానిని సేకరించి అమ్ముదామంటూ నమ్మబలికాడు. భర్త మాటలు నమ్మిన భార్య అనిత అతని వెంట వెళ్లింది. అక్కడికి వెళ్లిన వెంటనే ఆమె చీర కొంగుతో మెడకు బిగించి హత్య చేసి అక్కడి నుయ్యిలో పారవేశాడు. మెడలోని పుస్తెలతాడు, కాలి మెట్టెలు తీసుకున్న తర్వాత ప్రాణాలతో ఉందేమో అన్న అనుమానంతో మరోసారి నుయ్యిలోకి వెళ్లి బండరాయిని తలపై ఎత్తివేసి చనిపోయిందని ధ్రువీకరించుకొని ఇంటికి చేరుకున్నాడు. హైదరాబాద్‌లోని కాటేదాన్‌లో ఉన్న తన పెద్ద కూతురు శ్వేతకు ఫోన్ చేసి మీ అమ్మ నీ దగ్గరకు వస్తానంటే జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో బస్సు ఎక్కించానని చెప్పాడు. అయితే తల్లి ఎంత సేపటికీ రాకపోవడంతో తిరిగి కూతురు తండ్రికి ఫోన్ చేసి అమ్మ రాలేదని చెప్పడంతో.. ఆందోళన వ్యక్తం చేసి బంధువులకు ఫోన్‌చేసి వెతకాలని కోరాడు. తర్వాత ఈ నెల 20న పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన భార్య కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు.

బయట పడింది ఇలా..

తల్లి ఎక్కడికి వెళ్లినా కనీసం ఫోన్ అయినా చేసేదని.. కనించకుండా పోయి మూడు రోజులైనా ఆచూకీ లేకపోవడంతో కూతుళ్లు అనుమానించారు. కూచూరులో ఉన్న చిన్న కూతురు దగ్గరకు వెళ్లిన తండ్రి జంగిరెడ్డి వైఖరిలో మార్పు కనిపించడంతోపాటు అతని బైక్ కవర్‌లో తల్లికి సంబంధించిన పుస్తె, మెట్టెలు ఉండటంతో ఆమె వెంటనే తన అక్క, మేనమామలకు తెలిపింది. దీంతో అందరూ కలిసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడిగా జంగిరెడ్డిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం బయటపడింది. సెజ్ సమీపంలోని డంపింగ్ యార్డులో అనిత మృతదేహాన్ని గుర్తించి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

అమానవీయం..

- కొడుకులు, కోడళ్లు పట్టించుకోవడం లేదని ఆర్డీఓను ఆశ్రయించిన వృద్ధ దంపతులు


ఆర్డీఓ కార్యాలయం వద్ద వృద్ధ దంపతులు కొత్తకాపు అనసూయమ్మ, రాంరెడ్డి

కొత్తకోట రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న తమను కన్నకొడుకులు, కోడళ్లు పట్టించుకోవడం లేదని ఓ వృద్ధ దంపతులు శుక్రవారం వనపర్తి ఆర్డీఓను కలిసి గోడును వెల్లబోసుకున్నారు. వారి వివరాల మేరకు.. వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన కొత్తకాపు అనసూయమ్మ, రాంరెడ్డి దంపతులకు కుమారులు చెన్నారెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కూతురు పద్మ ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు చెన్నారెడ్డి కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. రోడ్డు ప్రమాదంలో చిన్న కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి కాళ్లు విరిగిపోయాయి. ప్రస్తుతం అతడు కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. రెండవ కుమారుడు లక్ష్మారెడ్డి భార్య చనిపోవడంతో గ్రామంలోనే ఉంటున్నాడు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాగోగులు చూసుకునేందుకు కొడుకులు ఎవరూ ముందుకు రావడం లేదు. కొన్ని నెలలుగా కూతురు పద్మ తల్లిదండ్రుల బాగోగులు చూస్తుంది. కాగా, పెద్దమందడి శివారులో రాంరెడ్డికి 17.17 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా.. కుటుంబ అవసరాల నిమిత్తం రెండెకరాల భూమిని విక్రయించారు. మిగతా భూమిలో ఒక్కో కుమారుడికి 3.18 ఎకరాల చొప్పున ఇచ్చారు. ప్రస్తుతం వృద్ధ దంపతులకు ఎలాంటి ఆస్తులు లేవు.

అనారోగ్యంతో అవస్థలు..

ఐదేళ్ల క్రితం రాంరెడ్డికి లివర్ ఆపరేషన్ అయ్యింది. అందుకు రూ. 3 లక్షల దాక ఖర్చయ్యాయి. ప్రస్తుతం అతడు పక్షవాతంతో బాధపడుతున్నారు. వైద్యపరీక్షలు, చికిత్సల కోసం రూ. 2 లక్షల వరకు వెచ్చించారు. వీరు ఉంటున్న ఇల్లు పైకప్పు శిథిలావస్థకు చేరడంతో రూ. 2 లక్షలు వెచ్చించి మరమ్మతు చేయించారు. ప్రస్తుతం వీరు ఉంటున్న ఇల్లు, 13 గుంటల ఖాళీ స్థలం తప్ప ఇతర ఆస్తులు లేవు. ఖాళీ స్థలం అమ్మితే వచ్చే డబ్బుతో అప్పులు కట్టడంతో పాటు రాంరెడ్డికి వైద్యం చేసేందుకు ఉపయోగ పడతాయని భావించారు. అయితే స్థలం పత్రాలు చిన్నకొడుకు శ్రీనివాస్‌రెడ్డి ఇవ్వకపోగా, స్థలాన్ని అమ్మనీయడం లేదని ఆర్డీఓతో వృద్ధ దంపతులు వాపోయారు.

అలంపూర్‌లో అపరిచితులు?


అపరిచిత వ్యక్తులను విచారిస్తున్న పోలీసులు (ఫైల్)

- ఆలయాలకు తరచూ వస్తున్న నాగసాధువులు, భైరవస్వాములు, సన్యాసులు, తాంత్రికులు
- అసలైన వారా.? నఖిలీలా..?
- ఇళ్లు, ఇంటి స్థలాలు కొనుగోలు చేసి మకాం వేస్తున్న కొత్త ముఖాలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ ఆలయంపై ఇటీవల కొందరు తాంత్రికుల చూపు పడింది. భక్తుల ముసుగులో ప్రవేశిస్తున్న కొందరు అపరచిత వ్యక్తులు తమను భైరవులు, తాంత్రికులు, స్వామీజీలుగా పరిచయం చేసుకుంటున్నారు. అలాగే నాగ సాధువులు, అఘోర ముసుగులో మరికొందరు ఇక్కడికి వస్తూ ఆలయానికి వచ్చే వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇంకొందరు కాషాయ దుస్తులు ధరించి సన్యాసులుగా పరిచయం చేసుకొని ఈ ప్రాంతంలో తరచూ సంచరిస్తున్నారు. ఈ మధ్యకాలంలో వీరంతా ఇక్కడికి ఎందుకు అధికంగా వస్తున్నారనేది అర్థం కానీ ప్రశ్న.

స్థానికతకు..

ఇక్కడికి తరచూ వచ్చే అపరిచితులు కొందరు ఆలయ సిబ్బంది, స్థానికులతో చనువు పెంచుకొని రహస్యంగా ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేసి పాగవేసి స్థానికత కోసం ప్రయత్నిస్తుండగా.. మరికొందరు నది తీర ప్రాంతంలోని భూమిని కొని ఆశ్రమాలు స్థాపించి పీఠాధిపతి ముసుగు ధరించే యోచనలో కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

అలంపూర్‌లో అఘోరతత్వ మంత్ర ఉపదేశమంటూ..

జోగుళాంబ ఆలయంలో అఘోరతత్వ దీక్ష 50 రోజుల సాధకుల కోసమంటూ ఇటీవల సామాజిక మాధ్యమంలో ఒక వీడియో వైరల్ కావడంతో స్థానికులు ఈ విషయాన్ని ఆలయ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పోలీసులు జూన్ 22వ తేదీన వీరి కోసం గాలించి పట్టణంలోని ఒక అద్దె గదిలో నలుగురు అపరిచిత స్వాములను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేసి మందలించి వదిలేశారు. అలాగే వారం కిందట ముగ్గురు సన్యాసులు శ్రీశైలం నుంచి వచ్చామని పరిచయం చేసుకొని పది రోజులుగా క్షేత్రంలో మఖాం వేశారు. ఆలయానికి వచ్చే భక్తులను తమ చుట్టూ కూర్చొబెట్టుకుని ఉపన్యాసాలు ఇవ్వసాగారు. ఏమిటి ఇది అని ప్రశ్నించిన అర్చకులు త్యాగరాజుశర్మ, పృథ్వినాథ్‌శర్మతో సదరు సన్యాసులు వాదనకు దిగారు. దీంతో ఆలయం సిబ్బంది, పోలీసులు వారిని ఇక్కడి నుండి పంపించారు.

అప్రమత్తంగా ఉండాలి..



అలంపూర్ ఆలయాలకు వచ్చే భక్తులు స్వామీజీలు, బాబాలతో అప్రమత్తంగా ఉండాలి. వ్యక్తిగత సమస్యలు, బలహీనతను ఆసరాగా చేసుకొని మోసం చేసే అవకాశం ఉంది.

– రాజశేఖర్‌శర్మ, రాష్ట్ర అధ్యక్షుడు, హిందూ ధార్మికసేన

దేవీ ఉపాసకులను గుర్తించలేకపోతున్నాం



శక్తిపీఠం కావడంతో దేవీ ఉపాసకులమని చెప్పుకొంటూ ఎవరెవరో వస్తున్నారు. కొందరు భక్తులను నమ్మించి మోసం చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకు దేవాదాయ, పోలీసుశాఖ కృషి చేయాలి.

– ఎంబీ సంజీవనాయుడు, స్థానిక భక్తుడు

అనుమానితులను ప్రశ్నిస్తున్నాం



ఆలయంలో ఎక్కువ రోజులు మఖాం వేసినా.. అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరించినా వెంటనే వారిని ప్రశ్నిస్తున్నాం. అలాగే వారితో పరిచయాలు పెంచుకోరాదని, వారికి దూరంగా ఉండాలని ఆలయ సిబ్బంది హెచ్చరించాం.

– పురేందర్‌కుమార్, ఈవో, అలంపూర్ ఆలయాలు

పటిష్ట నిఘా..



పట్టణంలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఆలయాలు, ఏటీఎం, తుంగభద్ర వంతెన, నిర్మానుష్య ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను విచారిస్తున్నాం. అవసరమైతే వారి వేలిముద్రలు, ఆధార్ కార్డులను కూడా పరిశీలిస్తున్నాం. అనుమానాస్పద వ్యక్తులపై పోలీసు నిఘా పటిష్టంగా ఉంది.

– నాగరాజు, ఎస్‌ఐ, అలంపూర్

గుండెపోటుతో బ్యాంకులోనే రైతు మృతి


కథలప్ప (ఫైల్)

మద్దూరు: పంట రుణం కోసం బ్యాంకు వచ్చిన రైతు గుండెపోటుతో బ్యాంకులోనే మృతిచెందిన సంఘటన శుక్రవారం మద్దూరులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. నారాయణపేట మండలం బొమ్మన్‌పాడు గ్రామానికి చెందిన రైతు గవినోళ్ల కథలప్ప అలియాస్ అబ్బాస్ (42) మద్దూరులోని ఓ బ్యాంకులో పంట రుణం కోసం గత మార్చి నుంచి తిరుగుతున్నాడు. అయితే అధికారుల సూచన మేరకు శుక్రవారం నోడ్యూస్ సర్టిఫికెట్లు, భూమి పట్టా పుస్తకాలు తీసుకొని భార్య గోవిందమ్మతో కలిసి బ్యాంకుకు రాగా.. రద్దీ ఎక్కువగా ఉండడంతో క్యూలైన్‌లో నిల్చున్నాడు. ఈ క్రమంలోనే సొమ్మసిల్లి పడిపోవడంతో వెంటనే బ్యాంకు సిబ్బంది ఆస్పత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అక్కడి నుంచి కథలప్ప మృతదేహాన్ని ఆయన భార్య గోవిందమ్మ స్వగ్రామానికి తీసుకెళ్లింది. ఈ విషయమై బ్యాంకు క్షేత్రాధికారిని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. కథలప్పకు భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

మొసలిని పట్టుకున్న అధికారులు


మొసలిని బంధించి తీసుకెళ్తున్న గ్రామస్తులు

మల్దకల్: మండల కేంద్రంలోని దేవర చెరువులో కొంతకాలంగా మొసలి సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. శుక్రవారం గ్రామానికి చెందిన రైతు సవారన్న పత్తిపొలంలో మొసలి ఉండటాన్ని గమనించి పోలీసు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు ఆరు గంటల పాటు శ్రమించి ఎట్టకేలకు పట్టుకున్నారు. మొసలిని ఆటోలో తీసుకెళ్లి కృష్ణానదిలో వదిలినట్లు ఫారెస్టు అధికారి ప్రసూన, పోలీసు సిబ్బంది తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

అచ్చంపేట: పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన మంత్రాల లింగమయ్య ఇంట్లో శుక్రవారం గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. లింగమయ్య ఇంటికి తాళంవేసి బయటకు వెళ్లగా.. దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ. 20 వేల నగదు, మూడు తులాల బంగారం ఆభరణాలు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

175.630 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతుంది. శుక్రవారం 11 యూనిట్లలలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 100.148 మిలియన్ యూనిట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 75.482 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఇప్పటి వరకు 175.630 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో వరదనీరు చేరుతుండడంతో 11 యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపడుతుండగా, 35,655 క్యూసెక్కులను వినియోగించి దిగువ శ్రీశైలంకు నీటిని వదులుతున్నారు.

శ్రీశైలంలో 884.2 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 884.2 అడుగుల నీటిమట్టం, 210.9 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 66,112 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 35,655, సుంకేసుల నుంచి 35,832, హంద్రీ నుంచి 250, మొత్తం 1,37,849 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,882, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,250 మొత్తం 69,132 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 30వేల క్యూసెక్కులు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.055 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 5.527 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి శుక్రవారం 38,277 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 8 గేట్లను తెరిచి 35,832 క్యూసెక్కులను దిగువకు వదిలి, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉందని ఏఈ సింగిరెడ్డి రనీల్ రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా 550 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 17 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 300 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 685, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.